సాక్షి
కర్నూలు
శుక్రవారం : 21 : జూన్ : 2024



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీధర్ కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



ఆరోగ్య 'యోగ'ం

యోగాసనాలు ఓ గంట పాటు వేస్తే రోగాలు తగ్గుముఖం పట్టి, రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చని శిక్షకులు చెబుతున్నారు. యోగాతో ఒత్తిడిని దూరం చేయవచ్చని సూచిస్తున్నారు. 8లో▸



దారితప్పిన చుక్కల దుప్పి

గడివేముల: నల్లమల అడవి నుంచి దారితప్పి పెసరవాయి గ్రామంలోకి చుక్కల దుప్పి వచ్చింది. కుక్కల దాడి నుంచి తప్పించుకుని వెళ్తున్న దానికి పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు.

డిజిటల్ దూకుడు

- జిల్లాలో పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- నగదు ప్రమేయం లేకుండా వ్యాపారాలు
- అందుబాటులో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం సేవలు
- క్యూఆర్ కోడ్‌కు పెరిగిన ప్రాధాన్యత
- నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తున్న బ్యాంకులు

టీ తాగినా.. పల్లీలు కొన్నా.. హోటళ్లలో భోజనం చేసినా.. దుకాణంలో బంగారం కొనుగోలు చేసినా.. ఇలా ప్రతి దానికీ ప్రజలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌నే వినియోగిస్తున్నారు. రూ.5 చెల్లింపునకు కూడా ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే వాడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 లక్షల బ్యాంకు ఖాతాలు ఉండగా.. ఇందులో 80 శాతం మంది డిజిటల్ లావాదేవీలే నిర్వహిస్తుండటం విశేషం.



కర్నూలు(అగ్రికల్చర్): ఒకప్పుడు నగదు రహిత లావాదేవీలు అంటే ఏమిటో 95 శాతం మంది ప్రజలకు తెలియదు. నగదు అవసరాలు ఎక్కువగా ఉండటంతో ఆర్‌బీఐ నుంచి కరెన్సీ చెస్ట్‌లకు డబ్బు ఎక్కువగా వచ్చేది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2016 నవంబరు 8వ తేదీన అప్పటి వరకు చెలామణిలో ఉన్న రూ.1000, 500 నోట్లు రద్దు చేశారు. దీంతో నగదు కొరత ఏర్పడటంతో డిజిటల్ లావాదేవీలకు అవకాశం వచ్చింది. మొదట్లో ఈ లావాదేవీలపై ప్రజలు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి అందుబాటులోకి వచ్చిన తర్వాత నేడు ప్రతి అవసరానికి వీటినే వాడుతున్నారు. స్మార్ట్ ఫోన్ ఉండి... బ్యాంకు ఖాతాలో నగదు నిల్వ ఉంటే చాలు... జేబులో రూపాయి లేకపోయినా దేశాన్నంతా తిరిగి రావచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం లావాదేవీల్లో 80 శాతం వరకు డిజిటల్ చెల్లింపులు కొనసాగుతుండటం విశేషం. డిజిటల్ లావాదేవీలు పెరిగిన తర్వాత ఆర్‌బీఐ నుంచి కరెన్సీ చెస్ట్‌లకు నగదు రావడం గణనీయంగా తగ్గిపోయింది.

తొలుత స్వైపింగ్..

పెద్ద నోట్లు రద్దు అయిన తొలినాళ్లలో స్వైపింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. మొదట్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) మిషన్‌లను వినియోగించేవారు. డెబిట్, క్రెడిట్ కార్డులను పీవోఎస్ మిషన్‌లలో స్వైపింగ్ చేసి చెల్లింపులు చేసేవారు. వీటిని ఫర్టిలైజర్ దుకాణాలు, మాల్స్, ఇతరత్రా పెద్ద స్టోర్‌లలో ఉంచేవారు. మొదట్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉండేది. ఈ మిషన్ల కోసం వ్యాపారులు పోటీపడే వారు. ప్రతి బ్యాంకు ఖాతాదారుడి మొబైల్ ఫోన్, పాన్ కార్డు లింక్ చేయడం, బ్యాంకు ఖాతాను బ్యాంకర్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం చేయడంతో డిజిటల్ లావాదేవీలు సులభం అయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నగదు ప్రమేయం, చెక్‌లు వంటి వాటికి అవకాశం లేకుండా డీబీటీ ద్వారా చెల్లింపులు చేపడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం డీబీటీ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేస్తుండటంతో అవినీతి, అక్రమాలు గణనీయంగా తగ్గిపోయాయి. వినియోగదారులు సైతం డిజిటల్ లావాదేవీలనే చేపడుతున్నారు.

క్యూఆర్ కోడ్‌కు పెరిగిన ప్రాధాన్యం

పీవోఎస్ మిషన్‌లలో కార్డులను స్వైపింగ్ చేయడం ద్వారా మొదలైన నగదు రహిత లావాదేవీలు తర్వాత రూపు మార్చుకున్నాయి. స్వైపింగ్ 90 శాతం వరకు తగ్గింది. నేడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఒక్క నిమిషంలోపే చెల్లింపులు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 34 బ్యాంకులకు 475 వరకు బ్రాంచీలు ఉన్నాయి. ఒక్క జిల్లా సహకార కేంద్రబ్యాంకు మినహా మిగిలిన బ్యాంకులన్నీ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ సదుపాయం, ఏటీఎంలు ఉన్నప్పటికీ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీయం సదుపాయం అందుబాటులోకి రాలేదు. వీటిని కూడా వినియోగదారులకు అందుబాటులోకి తేవడానికి డీసీసీబీ ప్రయత్నాలు చేస్తోంది. మిగిలిన అన్ని బ్యాంకులు డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహిస్తున్నాయి.

పారదర్శకంగా...

డిజిటల్ లావాదేవీలు పారదర్శకంగా ఉండటంతో వీటిపై ఆసక్తి పెరుగుతోంది. నేడు వీధి వ్యాపారులు, టీ కొట్టు నిర్వహించే వారు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు, చిన్న, చిన్న రిటైల్ వ్యాపారులు మొదలు కొని హోల్ సేల్ వ్యాపారులు కూడా డిజిటల్ లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్ వినియోగిస్తున్నారు. క్యూఆర్ కోడ్ లేని వ్యాపారం లేదంటే అతిశయోక్తి కాదు. ఫోన్, విద్యుత్ బిల్లులు వంటి వాటికి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌నే వినియోగిస్తున్నారు. స్వైపింగ్ పడిపోగా క్యూఆర్ కోడ్‌కు ప్రాధాన్యత గణనీయంగా పెరిగింది. డిజిటల్ లావాదేవీలు పెరిగిపోవడంతో ఆర్‌బీఐ కరెన్సీ నోట్ల ముద్రణను గణనీయంగా తగ్గించింది. ఈ ఏడాది మార్చి నెల వరకు పింఛన్లు నగదు రూపంలో పంపిణీ చేసేవారు. వీటి కోసం ఆర్‌బీఐ నుంచి కరెన్సీ చెస్ట్‌లకు నగదు వచ్చేది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో పింఛన్ సొమ్ము కూడా బ్యాంకు ఖాతాలకు విడుదల అయింది. దీంతో డిజిటల్ లావాదేవీలు మరింత పెరిగాయి.

ఆర్‌టీసీ బస్సుల్లో..

ఆర్‌టీసీ బస్సుల్లో కూడా డిజిటల్ లావాదేవీలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఆరు నెలల క్రితం నుంచే ఆర్‌టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలు అందుతున్నాయి. టికెట్‌లు ఇచ్చే మిషన్‌లోనే క్యూఆర్ కోడ్ ఉంటుంది. జేబులో రూపాయి లేకపోయినా బస్సెక్కి ప్రయాణించవచ్చు. ఫోన్‌పే చేస్తామంటే చాలు.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని కండక్టర్లు ప్రయాణికుడి ముందు పెడుతారు. స్కాన్ చేస్తే చాలు టికెట్ మొత్తంతో సహా వస్తుంది. ఆర్‌టీసీలో డిజిటల్ సేవలు పెరుగుతుండటం విశేషం.



సౌండ్ బాక్స్‌లతో మోసాలకు అడ్డుకట్ట..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుంది. వీటిని అడ్డుకట్ట వేసేందుకు క్యూఆర్ కోడ్ బోర్డులకు స్పీకర్ బాక్స్‌లను అనుసంధానం చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ చెల్లింపు జరుగగానే ఎంత మొత్తంలో దుకాణదారుకు జమ అయిందో సౌండ్ బాక్స్‌ల ద్వారా దుకాణదారులకు వాయిస్ రూపంలో వినపడుతుంది. డిజిటల్ పేమెంట్లపై అవగాహన లేని, చదువు రానివారికైనా సులభంగా అర్థమవుతుంది.



పండ్ల బండిపై క్యూఆర్ కోడ్ పెట్టిన దృశ్యం

80 శాతం డిజిటల్ చెల్లింపులు

2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్చి చివరి నాటికి జిల్లాలో 19,55,57,308 డిజిటల్ లావాదేవీలు జరిగినట్లు స్పష్టమవుతోంది. వీటికి సంబంధించి రూ.78,90,264.23 కోట్ల నగదు రహిత లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. నగదు రహిత లావాదేవీలు లేక ముందు ఖాతాదారులు బ్యాంకుల కు పోటెత్తే వారు. ఏటీఎం కేంద్రాలు, డెబిట్ కార్డులు వచ్చిన తర్వాత నగదు కోసం బ్యాంకులకు వెళ్లడం తగ్గింది. ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే తదితర యుపీఐ చెల్లింపులు పెరిగిన తర్వాత ఏటీఎంలలో రద్దీ తగ్గిపోయింది. 2023–24లో నగదు రహిత లావాదేవీలు 80 శాతం శాతం వరకు ఉన్నట్లు తెలుస్తోంది.



ఫోన్‌పేతో నగదు చెల్లిస్తున్న వినియోగదారుడు

2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి డిజిటల్ లావాదేవీల వివరాలు (రూ.కోట్లలో)

బీహెచ్ఐఎం/యూపీఐ	18,78,16,581	1,94,813.28
బీహెచ్ఐఎం/ఆధార్	19,111	35.72
భారత్ క్యూఆర్ కోడ్	40,325	158.22
ఐఎంపీఎస్	15,13,127	76,926.13
క్రెడిట్‌కార్డు/డెబిట్ కార్డు	45,60,399	1851.74
యుఎస్ఎస్‌డీ	16,07,765	792.27
మొత్తం	19,55,57,308	78,90,264.23



సమయం ఆదా అవుతోంది



డిజిటల్ పేమెంట్‌తో బ్యాంకులకు వెళ్లకుండా సమయం ఆదా అవుతుంది. చేతిలో డబ్బులు లేకున్నా బ్యాంక్ ఖాతాలో డబ్బులుంటే వస్తువులు కొనుగోలు చేయొచ్చు. ఒక్క రూపాయి నుంచి ఎంత వరకైనా ఫోన్‌పే, గూగుల్ పే తదితర యాప్స్ ద్వారా సులువుగా చెల్లించవచ్చు. ఆన్‌లైన్ పేమెంట్లు వచ్చిన తర్వాత మార్కెట్‌లో క్రయవిక్రయాలు కూడా బాగా పెరిగాయి. నెల వారీగా ఎంత ఖర్చు పెట్టామో తిరిగి చూసుకునే అవకాశం కూడా ఉంది.

– మనోజ్, వినియోగదారుడు, జిల్లెల్ల

డిజిటల్ పేమెంట్లు ఎంతో మేలు



ఎంతో కాలంగా నేను హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నాను. గతంలో వ్యాపారం కోసం వచ్చిన వారు తన వద్ద చిల్లర లేదని చెబుతుండటంతో తామే వెళ్లి తెచ్చి ఇవ్వాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం డిజిటల్ పేమెంట్‌తో చిల్లర సమస్య లేదు. అంతేకుండా లావాదేవీలు ఎంతో సులువుగా మారింది. చిల్లర ఇచ్చే సమయంలో తేడా వస్తే నష్టపోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– సుబ్బారావు, హోటల్ యజమాని, గోస్పాడు

ప్రోత్సహిస్తున్నాం



డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాం. నిరక్షరాస్యులు సైతం వీటిని సులభంగా చేయగలుగుతున్నారు. మొదట్లో డెబిట్, క్రెడిట్ కార్డులను పీవోఎస్ మిషన్‌లలో స్వైపింగ్ చేసి చెల్లింపులు చేసేవారు. ఇప్పుడు ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ లావాదేవీలకు ఆదరణ పెరిగింది. నగదు లావాదేవీలు తగ్గిపోయాయి.

– రామచంద్రరావు, ఎల్‌డీఎం, కర్నూలు

న్యూస్‌రీల్

నూతన డీజీపీ జిల్లాకు సుపరిచితుడే



కర్నూలు: రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన సీహెచ్ ద్వారక తిరుమల రావు జిల్లాకు సుపరిచితుడే. ఈయన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఉమ్మడి రాష్ట్రంలో మొదట 1991 నవంబర్ 20 నుంచి 1992 జూన్ 24 వరకు కర్నూలు అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. గుంటూరు జిల్లా దేవాపురంలో ఈయన సామాన్య కుటుంబంలో జన్మించారు. 2021లో ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ ఎండీగా పనిచేసే సమయంలో రెండు విడతలు, రాష్ట్ర విభజన అనంతరం మొదటిసారి కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో జరిగిన స్వాతంత్ర దిన వేడుకల్లో పాల్గొనేందుకు కర్నూలుకు వచ్చారు.

రాష్ట్రస్థాయి కార్యాలయాలను తరలించొద్దు



మాట్లాడుతున్న రవి కుమార్

కర్నూలు సిటీ: రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలులో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యాలయాలను అమరావతికి తరలించవద్దని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవి కుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాష్ట్ర రాజధాని కర్నూలులో ఏర్పాటు చేయాలని, రాజధాని లేని పక్షంలో హైకోర్టు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. విభజన చట్టం ప్రకారం గత ప్రభుత్వం మానవ హక్కుల కమిషన్ కార్యాలయం, లోకాయుక్త, విద్యుత్ రెగ్యులేటరీ ఆథారిటీ కార్యాలయం, వక్ఫ్‌బోర్డు కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేసిందన్నారు. నేడు కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రాష్ట్రస్థాయి ప్రభుత్వ కార్యాలయాలను తరలించి రాయలసీమ అన్యాయం చేసే ఆలోచనలను మానుకోవాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు అశోక్, విద్యాసాగర్, నగేష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ నివేదికలు అందించాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని సహకార సంఘాలు 2023–24 సంవత్సరం వరకు కార్యకలాపాలను ఆడిట్ చేయించి నివేదికలను అందించాలని జిల్లా సహకార అధికారి ఎస్ రామాంజనేయులు కోరారు. డీఆర్‌డీఏ (ఐకేపీ రూరల్), మెప్మా (ఐకేపీ అర్బన్) ఆధ్వర్యంలోని, ప్రత్యేకంగా నమోదు చేసుకున్న అన్ని సహకార సంఘాలు తమ ఆడిట్ నివేదికలను అందించాల్సి ఉందని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకటన వెలువడిన నాటి నుంచి 30 రోజుల్లోపు నివేదికలను అందించాలని, లేని పక్షంలో సంఘాల గుర్తింపు రద్దు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. నివేదికలను జిల్లా సహకార అధికారి వారి కార్యాలయం, సునయన ఆడిటోరియం పక్కన, కలెక్టర్ కాంప్లెక్స్, కర్నూలు అనే చిరునామాలో అందించాలన్నారు.

రైతుబజార్లలో పచ్చి మిర్చి పంపిణీ

కర్నూలు (అగ్రికల్చర్): పచ్చిమిర్చి ధర పెరిగిపోయి వినియోగదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో నో లాస్ నో ప్రాఫిట్ కింద పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. శుక్రవారం నుంచి కర్నూలులోని రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు పంపిణీ చేస్తారు. పులివెందులలో రైతుల నుంచి రెండు టన్నుల పచ్చిమిర్చి కొనుగోలు చేసిన మార్కెటింగ్ శాఖ కర్నూలు రైతుబజార్లకు తరలిస్తోంది. కొనుగోలు ధర, రవాణా చార్జీలు, హమాలీ చార్జీలు కలిపి నో లాస్ నో ప్రాఫిట్ కింద వినియోగదారులకు పంపిణీ చేస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. ప్రస్తుతం పచ్చిమిర్చి ధర కిలో రూ.100 వరకు ఉంది.

మైనారిటీ హాస్టల్‌లో ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులకు నగరంలోని గణేష్‌నగర్‌లోని పోస్టుమెట్రిక్ మైనారిటీ బాలుర వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీలక్కన్నా గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్న మైనారిటీ విద్యార్థులకు ఆసక్తి ఉంటే ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9052356257 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బీసీ హాస్టళ్లలో ఫౌండేషన్ ప్రోగ్రాం

- జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ



మాట్లాడుతున్న వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఫౌండేషన్ ప్రోగ్రాంను అమలు చేస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు, మ్యాథ్స్‌లో బేసిక్ నైపుణ్యాలను 45 రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమాన్ని కర్నూలు జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. గురువారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని వసతి గృహ సంక్షేమాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి అన్ని వసతి గృహాల్లో ఫౌండేషన్ ప్రోగ్రాంను ప్రారంభించాల్సి ఉందన్నారు. ముందుగా విద్యార్థులకు ప్రీ-టెస్ట్ నిర్వహించి వారిని గ్రూపులుగా విభజించి హాస్టళ్లలో ప్రత్యేక తరగతులను నిర్వహించడం ద్వారా బేసిక్ నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే హాస్టళ్ల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదన్నారు. ముఖ్యంగా వసతి గృహాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. మరుగుదొడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. స్టోర్ రూమ్‌లో నిత్యావసర సరుకులు పాడై పోకుండా చూడాలన్నారు. విద్యార్థులకు బయో మెట్రిక్ హాజరును తప్పక వేయాలని, రెన్యూవల్ బోర్డర్స్ అందరూ హాస్టళ్లకు వచ్చేలా చూడాలన్నారు. వసతి గృహాలకు కావాల్సిన సరుకుల వివరాలను గూగుల్ షీట్‌లో హాస్టల్ వారీగా ఇండెంట్‌ను బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు పంపాల్సి ఉందన్నారు. డైట్, కాస్మోటిక్ బిల్లులను వెంటనే ట్రెజరీలో సబ్‌మిట్ చేయాలని, కొత్త అడ్మిషన్లకు తప్పనిసరిగా సలహా కమిటీ ఆమోదం ఉండాలన్నారు. సహాయ సంక్షేమాధికారులు వారానికి రెండు వసతి గృహాలను సందర్శించాలన్నారు. హెచ్‌డబ్ల్యూఓకు మరొక హాస్టల్ బాధ్యతలు ఉంటే రెండింటిలో ఏదైనా ఒక హాస్టల్‌లో తప్పనిసరిగా ఉండాలన్నారు. బాలికల వసతి గృహాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు.



సమావేశానికి హాజరైన వార్డెన్లు

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

- విలేకరుల సమావేశంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్



కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో ఉన్న సమస్యలను తొలగించేందుకు కృషి చేయాలని కోరారు. గురువారం కర్నూలులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన తండాలు, గూడెలకు మంచినీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పది, ఇంటర్ తరువాత డ్రాప్ అవుట్ అవుతున్న గిరిజన విద్యార్థులను మళ్లీ పాఠశాలలు, కళాశాలల బాట పట్టించాలన్నారు. ఒక్క గిరిజన విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా చూసేందుకు కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలో గిరిజన భవన్‌ను నిర్మించేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని కోరారు.

బడి బస్సు.. భద్రత ఎంత?

- ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు
- ఎఫ్‌సీ పొందని బస్సులపై ప్రత్యేక నిఘా
- ఉమ్మడి జిల్లాలో 1,014 బడి బస్సులు
- ఎఫ్‌సీ చేయించుకున్నవి 772... చేయించుకోవాల్సినవి 242
- వివరాల సేకరణలో అధికారులు



కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో బడి బస్సు ను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కర్నూలు: విద్యా సంవత్సరం మొదలై వారం రోజులు గడచినప్పటికీ బడి బస్సుల సామర్థ్య పరీక్షలపై (ఎఫ్‌సీ) కొందరు యజమానులు నిర్లక్ష్యం చేస్తుండటంతో రవాణా శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో మూడు రోజులుగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి పాఠశాలల ప్రారంభానికి ముందే బడి బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే కొన్ని విద్యాసంస్థలు ఫిట్‌నెస్ తీసుకోకుండానే బస్సులను రోడ్డుపైకి తెస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం బస్సులు సామర్థ్య ధ్రువపత్రాలు పొందాయి. మిగిలిన 30 శాతం బస్సులకు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

ఎంవీఐలు స్వయంగా నడిపి...

కర్నూలులో డీటీసీ కార్యాలయం, ఆదోని, నంద్యాలలో ప్రాంతీయ రవాణా కార్యాలయాలతో పాటు డోన్, ఆత్మకూరు ప్రాంతాల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కార్యాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎంవీఐలు బస్సులకు పరీక్షలు నిర్వహిస్తారు. అనుమతులు లేని వాటికి జరిమానాలు, కేసులు నమోదు చేస్తుంటారు. తనిఖీల సందర్భంగా ఎంవీఐలు స్వయంగా నడిపి వాటి సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. బస్సుకు సంబంధించిన రికార్డులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అగ్నిమాపక పరికరం, అత్యవసర కిటికీ, అద్దాలను తుడిచే వైపర్లు, టైర్లు, బ్రేకులు, సీట్లు వంటివి సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తున్నారు. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్, ఐదేళ్ల అనుభవంతో పాటు బస్సు క్లీనర్ వివరాలను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఎఫ్‌సీ సర్టిఫికెట్‌తో పాటు పిల్లలను పరిమితికి మించి తరలిస్తున్నారా అనే అంశంపై దృష్టి సారిస్తున్నారు. బస్సుకు సంబంధించిన త్రైమాసిక పన్ను చెల్లించారా అనే వివరాలను ఆరా తీస్తున్నారు. ఇవేమీ లేకుంటే తనిఖీల్లో పట్టుబడిన వాహన యజమానులకు జరిమానా విధించనున్నారు.

వివరాల సేకరణలో అధికారులు....

కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన యాజమాన్యాలు తమ బస్సులకు ఎఫ్‌సీ పూర్తి చేయించుకున్న తర్వాతే నడపాల్సి ఉంటుంది. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ లేకుండానే రోడ్లపై తిప్పుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. గడువు తేదీ దాటిపోయినప్పటికీ కొందరు బస్సులకు ఎఫ్‌సీ చేయించుకోకుండానే నడుపుతున్నారని, వాటి ఫిట్‌నెస్‌పై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,014 బస్సులకు గాను 772 బస్సులకు ఎఫ్‌సీ పరీక్షలు పూర్తయ్యాయి. మిగిలినవి ఎక్కడెక్కడ ఉన్నాయి, ఏయే రూట్లలో తిరుగుతున్నాయి, వాటి కండీషన్ ఎలా ఉంది? అనే విషయాలపై అధికారులు సమాచారం సేకరిస్తున్నారు. ఒక్కో విద్యాసంస్థలో ఎన్ని బస్సులు ఉన్నాయి? రిపేర్ల పేరుతో పక్కన పెట్టినవి ఎన్ని? తదితర వివరాలను సేకరించే పనిలో ఉన్నారు.

15 ఏళ్లు దాటితే నడపకూడదు...

15 ఏళ్లు దాటిన బస్సులను విద్యార్థులను రవాణా చేసేందుకు వినియోగించకూడదన్నది నిబంధన. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు కాలం తీరిన బస్సులను వినియోగిస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో సుమారుగా 30కి పైగా ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత విద్యాసంవత్సరంలో ఇలాంటి బడి బస్సులపై సుమారు 50 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే 16తోనే ఎఫ్‌సీ పొందడానికి గడువు పూర్తయ్యింది. పాఠశాలలు పునఃప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఎఫ్‌సీలు చేయించుకోవడంలో కొందరు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బస్సుల సామర్థ్యం సరిగా లేని వాటిని పక్కన పెట్టడం, తుక్కుగా మార్చేయడం, విక్రయించడం, కొన్ని పాఠశాలలు మూతపడటం వంటి కారణాలతో బస్సులు తగ్గి ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. పిల్లలను ఆటోల్లో పంపించే తల్లిదండ్రులు అవి ఎలా ఉన్నాయో ఒకసారి పరిశీలించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లా	మొత్తం బడి బస్సులు	ఎఫ్‌సీ చేయించుకున్నవి	చేయించుకోవాల్సినవి
కర్నూలు జిల్లా	416	376	40
నంద్యాల జిల్లా	598	396	202
మొత్తం	1,014	772	242

ఇవీ లోపాలు...

మెడికల్ కిట్లు లేకపోవడం, కొన్నింటికి అధిక శబ్దం రావడంతో పాటు సైలెన్సర్ల నుంచి పొగ అధికంగా వెలువడటం వంటివి జరుగుతున్నాయి. లైట్లు సరిగా వెలగకపోవడం, కొన్ని దెబ్బ తినడం, మరికొన్నింటికి అద్దాలు పగిలిపోవడం, కొన్ని బస్సుల్లో సహాయకులు కనిపించడం లేదు. లైసెన్స్ లేని డ్రైవర్లతో కొన్ని బడి బస్సులను నడిపిస్తున్నారు. రెండవ రోజు తనిఖీల్లో లైసెన్స్ లేకుండానే డ్రైవర్ బస్సు నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

బడిపిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉన్నాం

బడి బస్సుల్లో పిల్లల భద్రత విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. 15 ఏళ్లు దాటిన వాహనాలకు అనుమతి లేదు. బస్సుపై పాఠశాల పేరు, సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా ఉండాలి. ఎఫ్‌సీ లేకుండా రోడ్డుపై బస్సులు తిప్పితే వాటిని సీజ్ చేస్తాం. ఇప్పటికే బృందాలను ఏర్పాటు చేసి మూడు రోజులుగా విస్తృత తనిఖీలు చేస్తున్నాం. ఎఫ్‌సీ చేయించుకోని బస్సులతో పాటు కాలం తీరిన బస్సుల వివరాలను కూడా సేకరిస్తున్నాం.

– రమేష్, ఆర్‌టీఓ

క్లుప్తంగా

యువతి అదృశ్యం

బనగానపల్లె రూరల్‌: నందివర్గం పోలీసు స్టేషన్‌ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన ఓ యువతి రెండు రోజులుగా కనిపించడం లేదు. ఎస్‌ఐ తిరుపాల్‌ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గుంతసల రామలచ్చమ్మ కుమార్తె సుచిత్ర బుధవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించిన ఆచూకీ తెలియకపోవడంతో యువతి తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కోవెలకుంట్ల: నంద్యాల – ఎర్రగుంట్ల రైల్వే మార్గంలోని కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌ సమీపంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వేశాఖ హెడ్‌ కానిస్టేబుల్‌ ఖలీల్‌ గురువారం అందించిన సమాచారం మేరకు.. 50 సంవత్సరాలు వయస్సు పైబడి తెల్లచొక్కా, బ్లూ షాట్‌ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి గుంటూరు నుంచి తిరుపతి వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్‌ పేర్కొన్నారు.

పలువురు వైద్యులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

కర్నూలు (హాస్పిటల్‌) : కర్నూలు మెడికల్‌ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు వైద్యులకు పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా అసోసియేట్‌ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 30 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. అందులో 16 మంది కర్నూలు మెడికల్‌ కళాశాలకు చెందిన వారే ఉన్నారు. వారిలో డాక్టర్‌ స్వాతి, డాక్టర్‌ శారద, డాక్టర్‌ చంద్రకళ (అనస్థీషియా), డాక్టర్‌ నీలోఫర్‌ సీమా (జనరల్‌ మెడిసిన్‌), డాక్టర్‌ పవన్‌ కుమార్‌ బాబు, డాక్టర్‌ అర్చన బాబు (ఆర్థోపెడిక్‌), డాక్టర్‌ పి.కవిత (రేడియాలజీ), డాక్టర్‌ పీఆర్‌ వనజ, డాక్టర్‌ సి.గాయత్రి (బయోకెమిస్ట్రీ), డాక్టర్‌ హసీనా (ఫిజియాలజీ), డాక్టర్‌ సౌజన్య, డాక్టర్‌ శ్యాంసుందర్‌ (న్యూరాలజీ), డాక్టర్‌ సుధాకర్‌ (ఓబీజీ), డాక్టర్‌ విజయ బాబు, డాక్టర్‌ మాధవకృష్ణ, డాక్టర్‌ పార్వతి (జనరల్‌ సర్జరీ) ఉన్నారు.

శ్రీశైలంలో నేడు గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం శ్రీశైల గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ డి.పెద్ది రాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శుక్రవారం సాయంకాలం పౌర్ణమి ఘడియలు పురస్కరించుకుని దేవస్థానం ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల మహామంగళ హారతుల అనంతరం ఆలయ మహాద్వారం నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ ప్రారంభవుతుందన్నారు. శ్రీశైల క్షేత్రాన్ని మరింత ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా గిరిప్రదక్షిణను నిర్వహించడం జరుగుతుందన్నారు.

వ్యక్తి బలవన్మరణం

నందికొట్కూరు రూరల్‌: శాతనకోట గ్రామానికి చెందిన చెందిన చంద్రమౌళి (47) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లో ఓ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఇతను కుటుంబ సమస్యలతో ఏడాది క్రితం భార్య లలితమ్మతో విడాకులు తీసుకున్నాడు. ఇటీవల తాను పని చేస్తున్న కంపెనీలో హోదా తగ్గిస్తూ ఇతర ప్రాంతానికి బదిలీ చేయడంతో మనస్తాపం చెందాడు. గ్రామానికి చేరుకున్న అతను బుధవారం రాత్రి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపారు.

సుంకేసుల జలాశయం



సుంకేసులకు జలకళ


ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో సుంకేసుల జలాశయం జలకళను సంతరించుకుంది. రిజర్వాయర్‌ పూర్తి సామర్థ్యం 1.2 టీఎంసీలు కాగా..గురువారం సాయంత్రం సమయానికి 1.152 టీఎంసీలకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 620 క్యూసెక్కులు ఉండగా ఒక గేటును పైకెత్తి దిగువకు 449 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కర్నూలు ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేసీకెనాల్‌కు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటినిల్వలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. జలాశయ సోయగాలను తిలకించేందుకు సందర్శకులు సుంకేసులకు వెళ్తున్నారు.

–సాక్షిఫొటోగ్రాఫర్‌, కర్నూలు

కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం



కర్నూలు శివారులో తుంగభద్ర వంతెన వద్ద నీటి ప్రవాహం



ఆరోగ్య ‘యోగ’ం

- రోజూ యోగా చేస్తే వ్యాధులు దూరం
- జిల్లాలో పెరుగుతున్న యోగా ప్రియులు
- ఉచిత శిక్షణ ఇస్తున్న కేంద్రాలు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

మారుతున్న జీవన విధానంతో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయితే ఈ ఒత్తిడికి దూరం చేయడానికి ఒకే ఒక సాధనం యోగా. ఈ యోగా ద్వారా ఒత్తిడిని దూరం చేయవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా యోగా ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రతి సంవత్సరం జూన్‌ 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్‌)/డోన్‌/కృష్ణగిరి/నంద్యాల(వ్యవసాయం)/ఆదోని సెంట్రల్‌

ఇటీవల కాలంలో జిల్లాలో యోగాపై ప్రజలకు మక్కువ పెరిగింది. గతంలో కేవలం జిల్లా కేంద్రంలో ఒక్కటి రెండు, మూడు సంస్థలు శిక్షణ కేంద్రాలు నెలకొల్పేవి. ఇప్పుడు ఆ సంఖ్య వందల్లోకి చేరింది. యోగా విద్య ద్వారా లబ్ధిపొందిన వారు ఇతరులకు ప్రయోజనాలు చెప్పి ఒప్పిస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 400కు పైగా యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. నంద్యాల, ఆదోని, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, శ్రీశైలం, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్‌ వంటి నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇప్పుడు శిక్షణ కేంద్రాలు వెలిశాయి. యోగా శిక్షణకు వెళ్లేవారిలో క్రమశిక్షణతో కూడిన జీవితం అలవడుతోంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా తెల్లవారుజామునే నిద్రలేవడం, గంట నుంచి గంటన్నర పాటు యోగాసనాలు వేయడంతో వారి దినచర్య ప్రారంభిస్తున్నారు. ఆధునిక జీవితంలో చాలా మంది శారీరక వ్యాయామం లేక, సీట్లకే పరిమితమైన ఉద్యోగాలు చేస్తూ స్థూలకాయులైపోతున్నారు. దీనికితోడు కల్తీ ఆహారం, జంక్‌, ఫాస్ట్‌ఫుడ్‌లు శరీరాన్ని నాశనం చేస్తున్నాయి. వీటి ద్వారా వచ్చే రోగాలను తగ్గించుకునేందుకు వైద్యులు చుట్టూ తిరుగుతూ వేలరూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. కానీ ఎలాంటి ఖర్చులేని యోగాసనాలు ఓ గంట పాటు వేయడం వల్ల రోగాలు తగ్గుముఖం పట్టి, రోజంతా ఉల్లాసంగా ఉండటమే గాక అధిక శ్రమతో ఎక్కువ పనిచేసుకుని, జీవితంలో మరింత అభివృద్ధిని సాధించవచ్చని యోగా శిక్షకులు చెబుతున్నారు. బీపీ, షుగర్‌, థైరాయిడ్‌, గుండెజబ్బులు, ఆస్తమా, గ్యాస్ట్రబుల్‌, సయాటికా, సర్వికల్‌ స్పెయిన్‌, వెన్నునొప్పి, మోకాళ్లనొప్పులు, మలబద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలన్నింటికీ యోగాతో చెక్‌ పెట్టవచ్చని వారు వివరిస్తున్నారు. యోగాసనాలు, ప్రాణాయామం చేస్తూ ఆహారవిహారాల్లో నియంత్రణ పాటించేవారు నిత్యం ఆరోగ్యంగా ఉంటారని వారు సెలవిస్తున్నారు. అయితే పుస్తకాలు, సీడీలు చూసి యోగాభ్యాసం మొదలుపెట్టకుండా ముందుగా శిక్షకుల వద్ద శిక్షణ పొందిన తర్వాతే యోగాసనాలు వేయడం మంచిదని వారు పేర్కొంటున్నారు.



డోన్‌లో యోగా శిక్షణ తీసుకుంటున్న దృశ్యం

మారుతున్న జీవనశైలి

యోగాతో శారీరక శ్రమనే గాక ఆహారపు అలవాట్లు కూడా మారుస్తోంది. యోగాను అభ్యసించేవారు ఒకరికొకరు మార్చుకున్న మంచి అలవాట్లను చెప్పుకోవడంతో అందరూ ఆ దిశగా ముందడుగు వేస్తున్నారు. భోజనంలో వరి అన్నం తగ్గిపోయి కొర్రలు, రాగులు, అరికెలు, జొన్నరొట్టెలు, గోధుమరొట్టెలు వచ్చి చేరాయి. ఏ ఆహారాన్నైనా కడుపు నిండా గాకుండా కాస్త మితంగా తినడం అలవాటు చేసుకున్నారు. ఆహారపు వేళలను కచ్చితంగా పాటించేవారూ అధికమవుతున్నారు. వేళకు భోజనం చేస్తే చాలా వ్యాధులకు చెక్‌ పెట్టవచ్చని నమ్ముతున్నారు. స్టీలు పాత్రల స్థానంలో రాగి పాత్రలు మళ్లీ వచ్చి చేరుతున్నాయి. రిఫ్రిజిరేటర్‌లో నీటికి బదులు వేసవిలో మట్టికుండ నీటికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

కర్నూలులో యోగాసనాలు వేసిన దృశ్యం



ఒత్తిడిని తగ్గించుకోవచ్చు



యోగాలో ప్రాణాయామం, ధ్యానం, ఆసనాలు ఉంటాయి. యోగా శరీరం, మనస్సు, భావోద్వేగం, శక్తి స్థాయిపై పనిచేస్తుంది. యోగా నాలుగు విస్తృత వర్గీకరణలకు దారి తీస్తుంది. మారుతున్న జీవన విధానంతో పాటు ఆహారపు అలవాట్లు కూడా అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం అవుతున్నాయి. ఈ రోజుల్లో చాలా మంది యువకులు మానసిక ఒత్తిడి, మైగ్రేన్‌ తలనొప్పి వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. యోగా అభ్యాసాలు ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.

–డాక్టర్‌ అర్షద్‌, ఫిజియోథెరపిస్ట్‌, కర్నూలు

సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధం



శారీరకంగా వ్యక్తపరిచే ఎలాంటి భంగిమనైనా ఆసనమని పేర్కొనవచ్చు. మెదడుకు, శరీరానికి బలమైన బంధాన్ని ఏర్పరిచేదే యోగాసనమని నా ప్రగాఢ విశ్వాసం. మొత్తం 84 ఆసనాలలో కొన్నింటినైనా సాధన చేయగలిగితే మానవుడు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చు.

– కందిమల్ల రాంపుల్లయ్య, గీతాయోగాసన సంఘం వ్యవస్థాపకులు, డోన్‌

ప్రతి రోజు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది



నాకు 80 సంవత్సరాలు. ముప్పై సంవత్సరాల నుంచి ప్రతి రోజూ యోగా చేయడంతో ఆరోగ్యంగా ఉన్నాను. రోజు వారి కార్యక్రమాలను ఎంతో సులువుగా అలసట లేకుండా పూర్తి చేస్తున్నా. కొంత బరువు కూడా తగ్గాను. యోగాతో పాటు పోషక పదార్థాలైన కాయగూరలు, పండ్లు తీసుకోవడంవల్ల దీర్ఘకాలిక జబ్బులు అదుపులో ఉన్నాయి.

–సుబ్బరామయ్య, నంద్యాల

రుగ్మతలు నయమవుతాయి



నేను కొన్నేళ్లుగా యోగా శిక్షకులుగా ఉంటూ కొన్ని వేల మందికి శిక్షణ ఇచ్చాను. శరీరం మనసుతో, మనసు ఆత్మతో, ఆత్మ పరమాత్మతో అనుసంధానమై ఉంటుంది. యోగా చేయడం వల్ల శారీరక, మానసిక బాధలన్నీ నయం అవుతాయి. ఇందులో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్‌, మానసిక వ్యాధులైన ఒత్తిడి, డిప్రెషన్‌, ఆందోళన, వర్టిగో, నిద్రలేమి వంటి సమస్యలను దూరం చేస్తుంది. రోజూ ప్రాణాయామం చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యం మరింత పెరుగుతుంది.

–ఎల్‌. నరేష్‌గౌడ్‌, యోగా శిక్షకులు, కర్నూలు

మానసిక ప్రశాంతత ఏర్పడింది



గతంలో నాకు విపరీతమైన బద్ధకం ఉండేది. ఏ పనీ చేయబుద్ధి అయ్యేది కాదు. ఒక చోట కూర్చుంటే మళ్లీ లేవాలనిపించదు. ఈ క్రమంలో యోగా నా జీవితాన్ని మార్చేసింది. ప్రతిరోజూ గంటన్నర నుంచి రెండు గంటల పాటు యోగా చేయడం వల్ల ఎంతో హుషారుగా ఉంటున్నాయి. రోజంతా మనసు ఉల్లాసంగా ఉంటోంది. గతంలో ఉన్న ఆరోగ్య సమస్యలన్నీ పోయాయి. నేను నేర్చుకున్న యోగాను పది మందికీ నేర్పించి వారిని సైతం మారుస్తున్నాను.

–బలరామ్‌, కర్నూలు

చిన్నప్పటి నుంచి నేర్చుకుంటున్నా



నాన్న యోగా మాస్టరు కావడంతో నేను చిన్నప్పటి నుంచే యోగాలో శిక్షణ తీసుకుంటున్నాను. యోగా చేయడం వల్ల కోపం, చికాకు, ఒత్తిడి వంటివి దరిచేరవు. మనసుకు ప్రశాంతతను చేకూరుతుంది. గిన్నిస్‌ బుక్‌ గ్రూపు ఆఫ్‌ రికార్డులో పాల్గొన్నాను. నేషనల్‌ లెవల్‌లో జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటాలని ఉంది.

– శ్రీరాగ, ఆదోని

చెల్లని చెక్కు కేసులో ఉపాధ్యాయుడికి జైలు శిక్ష

కర్నూలు (లీగల్‌): అవసరాలకు అప్పు తీసుకుని చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు కేసులో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు 1వ అదనపు జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ టి.జ్యోత్స్నదేవి గురువారం తీర్పు చెప్పారు. నగరంలోని బుధవారపేటకు చెందిన కె.శివశంకర్‌ అనే హోంగార్డు వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేసే నిర్మల్‌ కుమార్‌ తన అవసరాల కోసం 2015 జూలైలో రూ.లక్షన్నర, 2016లో మరోమారు రూ.లక్ష అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్స్‌ రాసిచ్చాడు. అప్పు చెల్లింపులో భాగంగా 2018 మార్చిలో రూ.2 లక్షల బ్యాంకు చెక్కు ఇచ్చాడు. తన బ్యాంకు ఖాతాలో నగదు నిల్వలు లేక చెక్కు చెల్లలేదు. దీంతో శివశంకర్‌ తన న్యాయవాది ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించింది. కేసు విచారణలో నిందితుడు నిర్మల్‌ కుమార్‌పై నేరం రుజువు కావడంతో సంవత్సరం కఠిన కారాగారశిక్ష, ఇచ్చిన బ్యాంకు చెక్కుకు అదనంగా మరో రూ.2 లక్షలు జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

పేకాట స్థావరంపై దాడులు

- 11 మంది అరెస్ట్‌, ఆరుగురు పరారీ

ఆదోని రూరల్‌: మండలంలోని పెద్దపెండేకల్‌ గ్రామంలో గుట్టుగా సాగుతున్న పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు చేశారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అందిన సమాచారం మేరకు సీఐలు, ఎస్‌ఐలతో కలిసి బృందాలుగా ఏర్పడి పేకాట స్థావరంపై దాడులు చేశారు. పేకాట ఆడుతూ 11 మంది పట్టుబడగా, ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.93,530, నాలుగు బైక్‌లు, 13 సెల్‌ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీఐలు తేజోమూర్తి, గోపి, నరసింహరాజు, ఎస్‌ఐలు మధుసూదన్‌, నరేంద్ర, చిన్నపీరయ్య, శ్రీనివాసులు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను చూపుతున్న తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్‌): న్యాయ సేవా సదన్‌లో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీలు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించి పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వ్యర్థాలను తొలగించుట కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు గ్రామం, మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజు నాయుడు, డీఎల్‌పీఓ ఎస్‌.నూర్జహాన్‌, డీఆర్‌పీ వి.జేమ్స్‌ కృపావరం, ఆంధ్రప్రదేశ్‌ కాలుష్య నియంత్రణ మండలి సైంటిఫిక్‌ ఆఫీసర్‌ జె.గణేశ్‌ కుమార్‌, కర్నూలు మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కర్నూలు: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో కర్నూలు స్టేషన్‌ సీఐ రాజేంద్రప్రసాద్‌, ఎస్‌ఐ మారుతీ ప్రసాద్‌ విద్యార్థులకు సూచించారు. జూన్‌ 26వ తేదీ అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు కోల్స్‌ కళాశాలలో సెబ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాలతో సమాజంపై జరిగే దుష్పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయనే విషయంపై వివరించారు. అనంతరం విద్యార్థుల చేత యాంటీ డ్రగ్‌ కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే ఎమ్మిగనూరులోని వైష్ణవి జూనియర్‌ కాలేజీలో సీఐ భార్గవరెడ్డి, ఎస్‌ఐ సత్యానారాయణ, కోసిగిలోని గవర్నమెంట్‌ జూనియర్‌ కాలేజీలో సీఐ ఎస్‌కే అహ్మద్‌ బాషా, ఎస్‌ఐ రమేష్‌, ఆదోనిలోని అక్షర జూనియర్‌ కాలేజీలో సీఐ విన్నీలత, కోడుమూరులోని వివేకానంద డిగ్రీ కళాశాలలో సీఐ రామాంజనేయులు, ఎస్‌ఐ అలీబేగ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ‘గంజాయి, మత్తు పదార్థాల వినియోగం – వాటి దుష్ప్రభావాలు’ అనే అంశంపై వివరించారు. ఆయా కళాశాలల్లో యాంటీ డ్రగ్‌ కమిటీలను కూడా ఏర్పాటు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సూపరింటెండెంట్‌ రవికుమార్‌ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ మారుతి ప్రసాద్‌

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



శిక్షణ ముగింపు సందర్భంగా అధికారులతో వైద్యులు

కర్నూలు(హాస్పిటల్‌): క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రామ్‌ అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్‌ క్యాన్సర్‌ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ రెండో బ్యాచ్‌ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ చాలా మంది క్యాన్సర్‌ చివరి దశలో గుర్తించి తమ జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణం నోటి శుభ్రత లేకపోవడం, పొగాకు ఉత్పత్తులు వాడటం, మద్యం సేవించడం లాంటివన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది క్యాన్సర్‌ నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు స్క్రీనింగ్‌ పక్కాగా నిర్వహించాలని సూచించారు. డాక్టర్‌ తులసి మాట్లాడుతూ.. క్యాన్సర్‌ తొలి దశలో విపరీతమైన అలసట, ఆకలి తగ్గడం, ఎలాంటి కారణం లేకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వీటిని గమనించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నోటి క్యాన్సర్‌ లక్షణాల్లో నోటిలో పుండ్లు, పెదవుల నుంచి రక్తం కారడం, దంతాలు వదులవ్వడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ సాహిత్య జయరామ్‌, డాక్టర్‌ రజిత, డాక్టర్‌ మంజూష, ప్రివెంటివ్‌ అంకాలజీ నోడల్‌ అధికారి డాక్టర్‌ నాగరాజు, ప్రాజెక్టనిస్టు ఖలీల్‌, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

- అమ్మవారి కిరీటం, ఆభరణాలు అపహరణ

మహానంది: తమ్మడపల్లె ఇంజవాణి చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని గంగమ్మ తల్లి మెడలో ఉన్న హారం, తలపై ఉన్న కిరీటం, అమ్మవారి రెండు చేతుల్లో ఉన్న ఆయుధాలతో పాటు బీరువాలోని పట్టు చీరలు, అమ్మవారికి అలంకరించే వివిధ రకాల ఆభరణాలు, మైకు, ఇతర సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం ఇదే ఆలయంలో ఆభరణాలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మహానంది పోలీసులు తెలిపారు.



బీరువా పగలగొట్టిన దృశ్యం

గుడికంబాలిలో ఇసుక డంపు స్వాధీనం

కర్నూలు (టౌన్‌): మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం గుడికంబాలి గ్రామంలో ఇసుక డంపును గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు మైనింగ్‌ అధికారులతో పాటు సెబ్‌ అధికారులతో కలిసి డంప్‌ను సీజ్‌ చేసినట్లు మైనింగ్‌ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్‌ వెల్లడించారు. స్థానిక ఎంఆర్‌ఓ, పోలీసులు, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో 29,700 క్యూబిక్‌ మీటర్ల ఇసుక ఉన్నట్లు లెక్కల్లో తేలాయి. గతంలో ప్రతిభ కన్‌స్ట్రక్షన్‌ ఈ డంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 2వ తేదీ ఈ కన్‌స్ట్రక్షన్‌ గడువు ముగిసింది. దీంతో ఇసుక అక్రమంగా తరలించకుండా పంచాయతీ కార్యదర్శి, పోలీసు, రెవెన్యూ విభాగానికి సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్‌ అనుమతులు వచ్చిన తరువాత ఇసుక అవసరాలకు సంబంధించి అన్ని పన్నులు చెల్లించిన తరువాత పంపిణీ చేస్తామని వెల్లడించారు.



ఇసుక డంపును పరిశీలిస్తున్న అధికారులు